సజావుగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

జగిత్యాల: పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

జగిత్యాల: పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర

జగిత్యాల, జూన్ 9: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో 7692 మంది అభ్యర్థులకు గానూ, 6057 మంది పరీక్షకు హాజరు కాగా, 1635 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 386 మంది ఇన్విజిలేటర్లు, 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 77 మంది బయోమెట్రిక్ ఆఫీసర్లు, నలుగురు రూట్ అధికారులు, 119 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 154 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ధరూర్‌లోని మౌంటెన్ కార్మల్ స్కూల్, మానస హైస్కూల్, నలంద జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు, అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, ఎస్‌కేఎన్‌ఆర్ బాయ్స్, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తనిఖీలు చేశారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, వివిధ శాఖల అధికారులు, తదితరులున్నారు.

ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కోరుట్ల, జూన్ 9: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, అరుణోదయ డిగ్రీ కళాశాల, మాస్టర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 984 మంది అభ్యర్థులకు గానూ 752 మంది హాజరయ్యారు. మాస్టర్ జూనియర్ కళాశాల సెంటర్‌లో ముగ్గురు అభ్యర్థులు మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.

కొడిమ్యాల, జూన్ 9: నాచుపల్లిలోని జేఎన్‌టీయూ పరీక్ష కేంద్రంలో 696 మంది అభ్యర్థులకు 517 మంది హాజరుకాగా, 179 మంది గైర్హాజరైనట్లు సూపరింటెండెంట్ సురేశ్ అర్జున తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

పటిష్ట భద్రత ఏర్పాటు

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 9: జిల్లాలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులను పోలీసులు పరీక్ష కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రంలోకి అనుమతించినట్లు చెప్పారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తదితరులున్నారు.

జగిత్యాల: అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కోరుట్ల: పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న విప్

ఆలయంలో పూజలు చేస్తున్న విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మల్యాల, జూన్ 9: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేయగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కఫీందర్, ప్రధాన అర్చకుడు వకుళాభరణం రఘు, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతురాలికి సత్కారం

ఇబ్రహీంపట్నం, జూన్ 9: మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన సుష్మ నీట్ ఫలితాల్లో 540 మార్కులు సాధించింది. కాగా, ఆదివారం సుష్మను స్థానిక శాంతినికేతన్ స్కూల్ పూర్వ విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వీడీసీ అధ్యక్షుడు ఓంకారి లక్ష్మణ్, కోటగిరి వెంకటస్వామి, గోదూరి మురళి, పాఠశాల కరస్పాండెంట్ బూరం నారాయణ, గోపాలకృష్ణ, గంగాధర్, వెంకటస్వామి, వేముల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుష్మను సన్మానిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

పెద్దమ్మ బోనాల జాతర

మెట్‌పల్లి రూరల్/కథలాపూర్, జూన్ 9: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్, రాంచలచ్చక్కపేట, వెల్లుల, కథలాపూర్ మండలం సిరికొండ గ్రామాల్లో ఆదివారం పెద్దమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ముదిరాజ్ కులస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు సమాజ సేవ చేయాలి

మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తదితరులు

- ప్రజలకు అన్నం పెడుతున్నది రైతన్నలే
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జగిత్యాల, జూన్ 9: మున్నూరు కాపు కులస్తులు సమాజ సేవ చేయాలని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జగిత్యాలలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో ఆదివారం మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాగా, ముఖ్య అతిథులుగా విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు అన్నం పెడుతున్నది రైతన్నలేనని పేర్కొన్నారు. మున్నూరు కాపు కులస్తులు వ్యవసాయంతో పాటు విద్య, వైద్యం, ఉద్యోగ, కార్మిక, వ్యాపార రంగాల్లోనూ ఉన్నారని తెలిపారు. రాజకీయ రంగంలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపుల అభ్యున్నతికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఉత్తమ రైతులను వేదికపైకి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒడ్నాల రాజశేఖర్, చిట్ల రమణతో పాటు జిల్లా కార్యసభ్యులతో మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్, ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ, మున్నూరు కాపు సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడంతో కుల బాంధవులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, జిల్లాలోని మున్నూరు కాపు సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన మున్నూరు సంఘం సభ్యులు

బహుమతుల ప్రదానం

మేడిపల్లి, జూన్ 9: మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో గడ్డం జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆది శ్రీనివాస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్‌గా తొంబర్‌రావుపేట జట్టు, రన్నరప్‌గా మేడిపల్లి జట్టు నిలిచాయి. విజేతలకు ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చేపూరి నాగరాజు, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాదం వినోద్, నూతిపెల్లి శంకర్, మామిడి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం

జగిత్యాల రూరల్, జూన్ 9: 'ఈనాడు' గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పత్రిక రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, జూన్ 9: మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి మురళీధర్ రావు మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీ జోగినిపెల్లి సుధాకర్‌రావు, మాజీ సర్పంచులు రామారావు, నారాయణ రావు, విజయరంగారావు, నర్సింహారెడ్డి, రాజయ్య, రాజనర్సు, తదితరులున్నారు.

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రేపు బీర్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం

సారంగాపూర్, జూన్ 9: బీర్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లచ్చాలు ఒక ప్రకటనలో తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని రైతువేదిక ఆవరణలో ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అలాగే, సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 14న ఎంపీపీ కోల జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లచ్చాలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

జగిత్యాల రూరల్/మల్యాల, జూన్ 9: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ డిమాండ్ చేశారు. మల్యాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, ఉచిత ఆరోగ్య కార్డు, బస్‌పాసులు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, భూమి రమణకుమార్, మరాటి గంగారెడ్డి, జుట్టు శంకర్, మెరుగు గంగస్వామి, కొండ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు చేసిన ఎమ్మెల్యే

వృద్ధుడికి కంటి పరీక్ష చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, జూన్ 9: జగిత్యాలలోని పావని కంటి దవాఖాన, ఆపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ 18 మంది పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావాణి

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూన్ 9: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి యథావిధిగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో కొనసాగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇన్ని రోజులు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రతి సోమవారం యథావిధిగా ప్రజావాణి నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు

విద్యానగర్, జూన్ 9: కేంద్ర మంత్రులుగా గంగపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులుగా తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

బెల్టులు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

కోరుట్ల, జూన్ 9: పట్టణంలోని కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో ఒకినొవా స్కూల్ ఆఫ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. కరాటే గ్రేడింగ్‌లో శిక్షణ పొంది ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు కరాటే చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్ రమేశ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గంగనాల ఆయకట్టు గేట్లకు మరమ్మతులు

ఇబ్రహీంపట్నం, జూన్ 9: వేములకుర్తి గ్రామ శివారులో గంగనాల కాల్వగేట్లు చెడిపోవడంతో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో గేట్లకు మరమ్మతులు చేయించి, పంటలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

కాలువ గేట్‌కు మరమ్మతులు చేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

పరామర్శ

మేడిపల్లి, జూన్ 9: మండల కేంద్రానికి చెందిన గడిపెల్లి అంజయ్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడడంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదివారం వెళ్లి అంజయ్యగౌడ్‌ను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, ఎంపీటీసీ పల్లి అర్జున్, నాయకులు చెన్నమనేని అజిత్‌రావు, ద్యావనపెల్లి అభిలాష్, సురేశ్, రాజాగౌడ్, లక్ష్మీరాజం, రావు శ్రీనివాస్ రావు, ప్రభాకర్‌రావు, మల్లేశ్‌గౌడ్, శేఖర్ తదితరులున్నారు.

అంజయ్యగౌడ్‌ను పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

రామడుగు (చొప్పదండి), జూన్ 9: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని రామడుగు క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ ఎడవెల్లి ఆనందరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రామడుగు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రామడుగు మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు.

మల్లాపూర్: ఎన్నికైన శివ భక్త మార్కండేయ పద్మశాలీ సేవా సంఘం సభ్యులు

కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్, జూన్ 9: మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్ర రమేశ్, ఉపాధ్యక్షుడిగా సాంబారి ప్రశాంత్, కోశాధికారిగా రుద్ర రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడిగా తోట రవితో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కొడిమ్యాల, జూన్ 9: పద్మశాలీ సేవా సంఘం ట్రస్ట్ కొడిమ్యాల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మకంటి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శిగా అంకం దశరథం, కోశాధికారిగా వేముల రవీందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, మండలాధ్యక్షుడు గాజుల లక్ష్మణ్, యువజన అధ్యక్షుడు మార్గం చిరంజీవి, మహేశ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ టేకేదారుల సంఘం..

మల్లాపూర్, జూన్ 9: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఎస్‌జే, ఎస్పీ ట్రస్ట్ బీడీ టేకేదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి దివాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సిరిపురం భూమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జిందం సత్యనారాయణ, కోశాధికారిగా సిరిపురం ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా సిరిపురం రాజేశ్‌కుమార్, ఎలిశెట్టి లింగేశ్వర్, ప్రచార కార్యదర్శిగా వివేక్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కొడిమ్యాల: అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కథలాపూర్/కోరుట్ల రూరల్, జూన్ 9: కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం కథలాపూర్ మండలం భూషణరావుపేట జడ్పీ హైస్కూల్ 2000-01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మిత్రులంతా ఒకచోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు.

వేదికపై పూర్వ విద్యార్థులు

విద్యుదాఘాతంతో బర్రె మృతి

పెగడపల్లి, జూన్ 9: పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో మంజ తిరుపతిగౌడ్‌కు చెందిన బర్రె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం బర్రె మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు బిగించిన ఎర్త్ వైర్ తగిలి షాక్ రావడంతో మృతి చెందింది. బర్రె విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తిరుపతిగౌడ్ కోరారు.

నాణ్యమైన విద్యనందించాలి

మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూన్ 9: పాఠశాలలో నాణ్యమైన విద్యనందించాలని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన కళాధార పబ్లిక్ స్కూల్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, తల్లిదండ్రులు లేని పిల్లలకు కొన్ని సీట్లు ఉచితంగా కేటాయించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎంపీపీ జవ్వాజి రేవతి, జడ్పీటీసీ భూమయ్య, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

నినాదాలు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

జగిత్యాల, జూన్ 9: పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముగ్దుమ్ మొహినొద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు బైరం హరికిరణ్, మేకల ప్రవీణ్, శివ రామకృష్ణ, ఊరడి ప్రభాకర్ పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి నిరంతర మంచినీటి సరఫరా

కార్పొరేషన్, జూన్ 9: కరీంనగర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 24 గంటల మంచినీటి సరఫరాకు సంబంధించిన పనులను జూలై చివరి నాటికి పూర్తి చేయించి, హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో ఇంటింటికీ నిరంతరం నీరందిస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక రిజర్వాయర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి ఓ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా చేసేందుకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నదన్నారు.